


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 93 | బుధవారం 02 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## బటన్ నొక్కడం కాదు..

### ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు ఇస్తున్నాం



2

"గత పాలకులు బటన్ నొక్కి చేతులు దులుపుకొన్నారు, రోడ్ల నిండా గుంతలు పెట్టారు. కానీ మేం అలా కాదు.. ప్రతి అవ్వాతాత ఇంటికి వచ్చి వారికి గౌరవంగా పెన్షన్ అందిస్తున్నాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు సూత్రాలతో ముందుకు సాగుతోందని ఆయన పునరుద్ఘాటించారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నియోజకవర్గంలోని మొగల్తూరులో మంగళవారం నిర్వహించిన 'పేదల సేవలో ప్రజా వేదిక' కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని ఆయన ప్రారంభించి ప్రసంగించారు.

## హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి యూనివర్సిటీలు..

# ఇక ఇక్కడే గ్లోబల్ విద్య!

- హైదరాబాద్‌లో లండన్, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీల క్యాంపస్‌లు
- భారత్‌లో తొలిసారిగా హైదరాబాద్‌లోనే వాటి ఏర్పాటు
- గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా మార్చే దిశగా తెలంగాణ ప్రభుత్వ చర్యలు
- హార్వర్డ్ వర్సిటీ సైతం కోర్సులు అందించేందుకు ఆసక్తి
- సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ఫలితంగా కుదిరిన ఒప్పందాలు



2

## నేపాల్ విపత్తు పై ముందే కీలక డేటా అందించిన 'నైసర్' శాటిలైట్

- విమర్శల నేపథ్యంలో వెలుగులోకి వచ్చిన వాస్తవాలు
- కొండచరియల్లో మార్పులను వారాల ముందే గుర్తించిన రాడార్
- చైనా పరిశోధకుడి విశ్లేషణలో కీలక విషయాల వెల్లడి
- ఇస్రో-నాసా సంయుక్తంగా అభివృద్ధి చేసిన శక్తిమంతమైన ఉపగ్రహం నైసర్



2

## పాక్ ప్రధాని ముందే ఉగ్రవాదం పై మోదీ కీలక వ్యాఖ్యలు..!

- ఎస్‌సీఓ వేదికగా ఉగ్రవాదం పై మోదీ ప్రసంగం
- ఉగ్రవాదానికి డబుల్ స్టాండర్డ్స్ ఉండకూడదని స్పష్టీకరణ
- టెర్రరిజాన్ని విధానంగా వాడే దేశాలకు గట్టి సందేశం ఇవ్వాలని పిలుపు



2

## కల్వకుంట్ల కవితకు కౌంటర్ ఇచ్చిన వేముల ప్రశాంత్ రెడ్డి



- కవిత చర్యల వల్ల కేసీఆర్ మనోవేదనకు గురవుతున్నారన్న ప్రశాంత్ రెడ్డి
- కేసీఆర్, కవితలను కలపడానికే తాను ప్రయత్నించానని వెల్లడి
- కవిత మధ్యలో వచ్చి మధ్యలోనే వెళ్లిపోయారని ఎద్దేవా

2

## విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలాడుతోంది

- విద్యార్థుల భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్న శ్రీనివాస్ యాదవ్
- రూ. 11 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెండింగ్‌లో పెట్టారని మండిపాటు
- విద్యార్థుల పోరాటానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని వెల్లడి

2



## రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొండా సుస్మిత



2

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండా సురేఖ అంశం ఉత్కంఠను రేపుతున్న సంగతి తెలిసిందే. తాజా పరిణామాల నేపథ్యంలో సురేఖ హుటాహుటిన ఢిల్లీకి పయనమయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నుంచి వచ్చిన అత్యవసర పిలుపు మేరకు ఆమె హస్తిన బాట పట్టారు. ఈ పర్యటనలో భాగంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సురేఖ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.

## పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖల పై మంత్రి నారా లోకేశ్ సమీక్ష



2

- వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధనకు పక్కా ప్రణాళికలు
- అక్షర ఆంధ్ర కార్యక్రమంతో ఏడాదిలో 25 లక్షల మందికి అక్షరజ్ఞానం
- బడిబయట ఉన్న 1.64 లక్షల మంది పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశం
- మధ్యాహ్న భోజనంపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని తల్లిదండ్రులకు, టీచర్లకు సూచన

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


## పాక్ ప్రధాని ముందే ఉగ్రవాదం పై మోదీ కీలక వ్యాఖ్యలు..!

ఉగ్రవాదం పై భారత్ వైఖరిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని విధానంగా ఉపయోగించే దేశాలకు గట్టి సందేశం ఇవ్వాలని అన్నారు. ఉగ్రవాదం ఎవరికీ వ్యూహాత్మక ఆయుధం కారాదని తేల్చి చెప్పారు. కిర్గిజిస్థాన్‌లోని బిష్కెక్‌లో మంగళవారం జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) రౌండ్‌టేబుల్ చర్చలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశానికి పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో పాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సహా పలువురు దేశాధినేతలు హాజరయ్యారు. ఉగ్రవాదం విషయంలో ఎలాంటి ద్వంద్వ వైఖరికి అవకాశం ఉండకూడదని మోదీ అన్నారు. ఈ తీవ్రమైన అంశంపై అన్ని దేశాలు ఒకే గొంతుతో మాట్లాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని తమ విధానంలో భాగంగా ఉపయోగించే దేశాలతో పాటు ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇచ్చే దేశాలకు కూడా గట్టి సందేశం ఇవ్వాలని అన్నారు. అంతకుముందు ఎస్‌సీఓ నేతలు అధికారిక గ్రూప్ ఫొటోకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మోదీ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కొద్దిసేపు మాట్లాడారు. రెండు రోజుల సదస్సు సందర్భంగా మోదీ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. అయితే షీ జిన్‌పింగ్‌తో మోదీ భేటీ అయ్యే అవకాశం లేదని తెలుస్తోంది. 26వ ఎస్‌సీఓ సదస్సులో 10 సభ్య దేశాలతో పాటు 15 భాగస్వామ్య దేశాలు, రెండు పరిశీలక దేశాలు పాల్గొంటున్నాయి. ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఈ సదస్సులో చర్చిస్తున్నారు.

## నేపాల్ విపత్తు పై ముందే కీలక డేటా అందించిన 'నైసర్' శాటిలైట్

నేపాల్‌లో ఇటీవల సంభవించిన ఘోర విపత్తు నేపథ్యంలో, ఇస్రో-నాసా సంయుక్తంగా రూపొందించిన 'నైసర్' ఉపగ్రహం పనితీరు పై వచ్చిన విమర్శలు నిరాధారమని తేలింది. విపత్తును ముందుగా హెచ్చరించడంలో ఈ శక్తిమంతమైన శాటిలైట్ విఫలమైందన్న ఆరోపణలను తాజా విశ్లేషణలు పటాపంచలు చేశాయి. విపత్తు సంభవించడానికి కొన్ని వారాల ముందే నైసర్ స్పష్టమైన హెచ్చరిక సంకేతాలను పంపిందని వెల్లడైంది. చైనాలోని చాంగాన్ యూనివర్సిటీకి చెందిన పరిశోధక విద్యార్థి జెన్‌షియాంగ్ లియు, నైసర్ చిత్రాలను విశ్లేషించి ఈ కీలక విషయాలను వెల్లడించాడు. విపత్తు సంభవించడానికి కొన్ని వారాల ముందే ప్రమాదకర ప్రాంతంలోని పర్వత వాలులో భారీ మార్పులు చోటుచేసుకున్నట్లు అతడు గుర్తించాడు. అక్కడి మంచు, రాతి పొరలు తీవ్ర ఒత్తిడికి గురై, ఆ ప్రాంతం ఏకంగా కొన్ని మీటర్ల మేర పక్కకు జరిగినట్లు తేలింది. ఈ కదలికలు ఒకేచోట కేంద్రీకృతం కావడం, రాబోయే కొండచరియల విపత్తుకు స్పష్టమైన సంకేతమని లియు తన విశ్లేషణలో పేర్కొన్నాడు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా) సంయుక్తంగా ఈ 'నైసర్' (నాసా-ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్) ఉపగ్రహాన్ని అభివృద్ధి చేశాయి. ప్రకృతి వైపరీత్యాలను ముందే గుర్తించి, హెచ్చరికలు జారీ చేసే లక్ష్యంతో దీన్ని గత ఏడాదే ప్రయోగించారు. ఇది ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన భూ పరిశీలన ఉపగ్రహాల్లో ఒకటి. మేఘాలు, వర్షం, పొగమంచు వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ పగలు, రాత్రి తేడా లేకుండా స్పష్టమైన చిత్రాలను తీయగల రెండు సింథటిక్ అపెర్చర్ రాడార్లను (ఎల్-బ్యాండ్, ఎస్-బ్యాండ్) కలిగి ఉన్న తొలి శాటిలైట్ ఇదే. ఈ వివరాల ప్రకారం, నైసర్ తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించిందని, విపత్తుకు సంబంధించిన కీలక సమాచారాన్ని ముందే అందించిందని స్పష్టమవుతోంది. అయితే, ఆ సంకేతాలను సరైన సమయంలో విశ్లేషించి, తక్షణమే రక్షణ చర్యలు చేపట్టడంలోనే అసలు సవాలు ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలాడుతోంది

తెలంగాణలోని లక్షలాది మంది విద్యార్థుల ఉన్నత చదువులను, వారి భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తున్న నాయకులు, విద్యార్థులు వెస్ట్ మారేడ్‌పల్లి లోని క్యాంప్ కార్యాలయంలో తలసానిని కలసి, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ... పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల వల్ల ఉన్నత విద్యకు దూరం కాకూడదనే సదుద్దేశంతో నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తెచ్చారని... ఆ తర్వాత కేసీఆర్ హయాంలో కూడా సకాలంలో నిధులు విడుదల చేశారని గుర్తుచేశారు. కానీ, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏకంగా రూ. 11,000 కోట్ల బకాయిలను పెండింగ్‌లో పెట్టి విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాల యాజమాన్యాలు కోర్సులు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే శాసనసభ సమావేశాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని, బీఆర్ఎస్ పార్టీ విద్యార్థుల పోరాటానికి సంపూర్ణ అండగా ఉంటుందని తలసాని హామీ ఇచ్చారు. నీట్ పేపర్ లీకేజీపై 'జెన్ జీ' యువత జరిపిన నిరసనలతో కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా దిగొచ్చిందో, అదే స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా విద్యార్థులు గట్టి పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి యూనివర్సిటీలు.. ఇక ఇక్కడే గ్లోబల్ విద్య!

హైదరాబాద్ నగరం గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా ఎదిగే క్రమంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. బ్రిటన్‌కు చెందిన ప్రతిష్టాత్మక 'యూనివర్సిటీ ఆఫ్ లండన్', అమెరికాలోని బోస్టన్‌కు చెందిన 'నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ' తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నాయి. ఈ రెండు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం బ్రిటన్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. అయితే, రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో, అధికారుల బృందం అగ్రరాజ్యంలో పర్యటించింది. ఈ పర్యటనల్లో భాగంగా నిర్వహించిన ఉన్నత స్థాయి చర్చలు సఫలీకృతం కావడంతో, ఈ ప్రఖ్యాత విద్యాసంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు అంగీకరించాయి. వీటితో పాటు, ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం సైతం తెలంగాణలో స్వల్పకాలిక 'ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు', విభిన్న కోర్సులను అందించేందుకు ఆసక్తి కనబరిచినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి అగ్రశ్రేణి విద్యాసంస్థలతో జరిపిన చర్చలు కూడా ఫలవంతమయ్యాయి. ఈ పరిణామం పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు తెలంగాణతో భాగస్వామ్యం కావడం రాష్ట్రానికి గర్వకారణమని ఆయన కొనియాడారు. నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, విద్యపై ప్రత్యేక దృష్టి సారించి, రాష్ట్ర యువత విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా హైదరాబాద్?లోనే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను పొందేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నూతన జాతీయ విద్యా విధానం కింద విదేశీ వర్సిటీలకు లభించిన వెసులుబాటును వినియోగించుకుంటూ, ఉన్నత విద్యా రంగంలో హైదరాబాద్ తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటోంది.

# బటన్ నొక్కడం కాదు.. ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు ఇస్తున్నాం

గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన దుస్థితి ఉండేదని, తమ ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి పలికిందని చంద్రబాబు అన్నారు. వాలంటీర్ వ్యవస్థను దుర్వినియోగం చేసిన గత పాలకుల తీరును ఆయన తప్పుబట్టారు. ఇప్పుడు తాము నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి, పెంచిన పెన్షన్లను అందిస్తూ వారి ఆత్మగౌరవాన్ని నిలబెడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న చంద్రబాబు, 31 ఏళ్ల క్రితం సెప్టెంబరు 1 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణస్వీకారం చేశానని, అప్పటి నుంచి ప్రజా చైతన్యం, ప్రజా భాగస్వామ్యమే ధ్యేయంగా పనిచేస్తున్నానని తెలిపారు. ఇప్పటివరకు పెన్షన్ల రూపంలో రూ.73,507 కోట్లు అందించామని, గత రెండేళ్లలో సంక్షేమ పథకాల కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేశామని వివరించారు.

**మహిళా సాధికారత నుంచి సామాజిక న్యాయం వరకు**

మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చంద్రబాబు అన్నారు. పొదుపు ఉద్యమానికి శ్రీకారం చుట్టిన డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలను ఆర్థికంగా నిలబెట్టామని, ఇప్పుడు 'దీపం-2.0' పథకం ద్వారా ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి వారిని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతున్నామని చెప్పారు. గత ఏడాది లక్ష మంది డ్వాక్రా మహిళలు ఎంఎస్ఎంఈలుగా ఎదిగారని, ఈ లక్ష్యాన్ని మరింత పెంచుతామని, వారు తయారు చేసే ఉత్పత్తులకు 'స్వయం' బ్రాండ్‌తో మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే 'స్త్రీశక్తి' కార్యక్రమం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి వారిపై ఆర్థిక భారం తగ్గించామని అన్నారు. సంక్షేమం అంటే కేవలం డబ్బులు పంచడం కాదని, అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధిలోకి తీసుకురావడమేనని సీఎం పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల్లో ఇంకా ఉన్న వెనుకబాటుతనాన్ని రూపుమాపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా వడ్డెర్లకు మైనింగ్‌లో, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించామని, మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణను అమలు చేసి సామాజిక న్యాయం చేశామని గుర్తుచేశారు.

**ఏకగ్రీవాలు వద్దనడం వారి ఓటమి భయానికి నిదర్శనం**

రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎన్డీఏ కూటమిదే విజయమని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఓటమి భయంతోనే 'గొడ్డలి పార్టీ' స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా అడ్డుకునేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఏకగ్రీవాలను వద్దనడం వారి ఓటమి భయానికి నిదర్శనమని, గతంలో ప్రభుత్వాలే ఏకగ్రీవాలను ప్రోత్సహించాయని గుర్తుచేశారు. ఆయారాం-గయారాంలను అరికట్టేందుకు మేయర్, చైర్మన్ ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో పెట్టామని తెలిపారు. బీసీ రిజర్వేషన్లను కూడా తగ్గించి ఆ వర్గాలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖల పై మంత్రి నారా లోకేశ్ సమీక్ష

రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసి, సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 'అక్షర ఆంధ్ర' కార్యక్రమం ఉద్యమంలా సాగుతోందని, దీని ద్వారా వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి రాష్ట్రాన్ని వంద శాతం అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా నిలపాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో మంగళవారం పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖల ఉన్నతాధికారులతో మంత్రి నారా లోకేశ్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా విద్యావ్యవస్థలో చేపడుతున్న సంస్కరణలు, కార్యక్రమాల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... 2024 నాటికి రాష్ట్ర అక్షరాస్యత శాతం కేవలం 72.6 శాతంతో దేశంలోనే అట్టడుగున ఉందని, అయితే గత ఏడాదిగా కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో కేవలం ఒక్క ఏడాదిలోనే 25 లక్షల మంది నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారారని తెలిపారు. ఈ కృషిని కేంద్ర ప్రభుత్వం కూడా అభినందించిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల కేంద్రం విడుదల చేసిన వయోజన విద్య పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర అక్షరాస్యత శాతం 10శాతం పెరిగి 82.1 శాతానికి చేరుకుందని, ఇదే స్ఫూర్తితో 2027 సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని కోరారు. ఇందుకు అనుగుణంగా 2027 మార్చి నాటికి మరో 25 లక్షల మందిని, ఆపై సెప్టెంబర్ నాటికి మిగిలిన 27 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు వివరించారు. 11 ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ బృహత్ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి, ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు.

**బడిబయట పిల్లలందరినీ బడిలో చేర్పించాలి**

పాఠశాల విద్యపై సమీక్షిస్తూ, రాష్ట్రంలో బడిబయట ఉన్న 1,64,821 మంది పిల్లలను గుర్తించి, వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ఈ ఏడాది ఇప్పటికే 33 వేల మందిని పాఠశాలల్లో చేర్పించామని, మిగిలిన వారి వివరాలను 'లీప్' యాప్ ద్వారా ప్రధానోపాధ్యాయులకు పంపామని పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. పిల్లలను బడికి పంపేలా తల్లిదండ్రులను చైతన్యవంతం చేస్తున్నామని అన్నారు.

# కల్వకుంట్ల కవితకు కౌంటర్ ఇచ్చిన వేముల ప్రశాంత్ రెడ్డి

కష్టకాలంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెంట ఉన్నది ఎవరో కవిత తెలుసుకోవాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. తనపై కవిత చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. కవిత చర్యల వల్ల తండ్రి కేసీఆర్ ఎంతటి మనోవేదనకు గురవుతున్నారో ఆమె ఆలోచించుకోవాలని... తాను ఎప్పుడూ కేసీఆర్-కవితలను కలపడానికే ప్రయత్నించాను తప్ప విడగొట్టడానికి కాదని స్పష్టం చేశారు. తాను, తన తండ్రి వేముల సురేందర్ రెడ్డి 2001లో పార్టీ ఆవిర్భావానికి ముందే కేసీఆర్ వెంటే ఉన్నామని, తాము టీఆర్ఎస్ (బీఆర్ఎస్) వ్యవస్థాపక సభ్యులమని గుర్తుచేశారు. "బీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి అంటేనే బీఆర్ఎస్" అని పేర్కొన్న ఆయన... కవిత మధ్యలో వచ్చి మధ్యలోనే వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. పార్టీ లైన్ దాటినందుకే ఆమెపై చర్యలు తీసుకున్నారని తెలిపారు. అసెంబ్లీ లోపలా బయటా రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై నిరంతరం పోరాడుతున్నది ఎవరో ప్రజలందరికీ తెలుసన్నారు. తాను కాంగ్రెస్ నాయకులతో ఎలాంటి మంతనాలు జరపలేదని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధానంలో ప్రమాణపూర్వకంగా చెప్పగలనని... మరి కాంగ్రెస్‌తో కవిత రహస్య మంతనాలు జరపలేదని ఆమె చెప్పగలరా? అని నిలదీశారు. కేసీఆర్‌కు అత్యంత ఆప్తులుగా, బలంగా ఉన్న నాయకులపై నిరాధార ఆరోపణలు చేస్తూ... పార్టీని బలహీనపరిచి పరోక్షంగా అధికార కాంగ్రెస్ పార్టీకి కవిత లబ్ధి చేకూరుస్తున్నారని ఆరోపించారు. సభలో ఆమె కన్నీళ్లు పెట్టుకోవడం కేవలం రాజకీయం కోసం, సానుభూతిని పొందేందుకేనని విమర్శించారు. కవితను రెండుసార్లు ఎమ్మెల్సీని చేయడంలో తన పాత్ర ఏంటో కేసీఆర్‌కు స్పష్టంగా తెలుసని, నిన్నటి వరకు ఆమెపై ఉన్న గౌరవాన్ని తన వ్యాఖ్యలతో కవిత స్వయంగా పోగొట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొండా సుస్మిత

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండా సురేఖ అంశం ఉత్కంఠను రేపుతున్న సంగతి తెలిసిందే. తాజా పరిణామాల నేపథ్యంలో సురేఖ హుటాహుటిన ఢిల్లీకి పయనమయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నుంచి వచ్చిన అత్యవసర పిలుపు మేరకు ఆమె హస్తిన బాట పట్టారు. ఈ పర్యటనలో భాగంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సురేఖ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అలాగే, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసేందుకు కూడా ఆమె అపాయింట్ మెంట్ కోరారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిలను ఉద్దేశించి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సొంత పార్టీ ముఖ్యమంత్రిపైనే విమర్శలు గుప్పించడాన్ని తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ... ఆ వ్యాఖ్యల పై తక్షణమే వివరణ ఇవ్వాలంటూ మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో కమిటీ ఛైర్మన్ మల్లు రవికి ఆమె ఇప్పటికే తన వివరణను సమర్పించారు. కొండా సురేఖ ఇచ్చిన వివరణతో పాటు, వనపర్తి వ్యవహారంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన సమగ్ర నివేదికను టీపీసీసీ నేరుగా అధిష్ఠానానికి పంపించింది. అధిష్ఠానం వద్దకు నివేదికలు చేరిన వెంటనే కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు రావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తోంది. క్రమశిక్షణ ఉల్లంఘన అంశంలో కాంగ్రెస్ హైకమాండ్ మంత్రి సురేఖ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోనుందన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
బుధవారం 02 సెప్టెంబర్ 2026

# సంపాదకీయం

## పచ్చి దోపిడీ..!



వెనెజువెలాలో 65 బిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలు తమ అధీనంలోకి వచ్చే ఒప్పందం కుదిరిందంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శుక్రవారం ప్రకటించారు. ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద చమురు ఒప్పందంగా దీనిని అభివర్ణించారాయన. ఒక అర్థరాత్రివేళ అమెరికన్ సైనికబలగాలు విమానాల్లో దిగి, వందలాదిమంది వెనెజువెలా భద్రతాదళాలను కాల్చిచంపి, ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురోను అపహరించుకుపోయి అమెరికా జైళ్లలో కుక్కిన ఎనిమిది నెలల్లోనే ట్రంప్ అసలు లక్ష్యం నెరవేరడం మొదలైందన్నమాట.అరవై ఐదు బిలియన్ బ్యారెళ్ళ చమురు నిల్వలున్న ఈ క్షేత్రాల పరిమాణం వెనెజువెలా మొత్తం చమురు క్షేత్రాల్లో ఐదోవంతు. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న ఈ దేశంలోని క్షేత్రాలు పూర్తిగా అమెరికా నియంత్రణలోకి పోవడం ఇక ఎంతో దూరంలో లేదని అర్థం. అమెరికా సన్నిహితుడైన వెనెజువెలా వ్యాపారవేత్త అలెజాంద్రో బెటన్‌కోర్ట్ ఈ పదిహేడు క్షేత్రాల నుంచి తైలం తవ్వితీయబోతున్నారని, ఈ దెబ్బతో ఆయన కంపెనీ 'నార్త్ అమెరికన్ బ్లూ ఎనర్జీ పార్ట్‌నర్స్' ఆ దేశంలో రెండవ అతిపెద్ద ప్రైవేటు చమురు కంపెనీగా అవతరిస్తుందని ఒక ప్రముఖ ఆంగ్ల దినపత్రిక అంటోంది. ఈ భారీ చమురు ఒప్పందంలో పెంటగాన్‌కూ వాటా దక్కబోతున్నదని, దాని 'ఆఫీస్ ఆఫ్ స్ట్రాటజిక్ క్యాపిటల్' (ఓఎస్‌సీ) పెన్నీవారెంట్‌తో అంటే, దాదాపు సున్నా పెట్టుబడితో 35శాతం వాటాని, ఉత్పత్తికి వ్యయానికే ఐదోవంతు చమురునూ కొనుగోలు చేయగలిగే హక్కులను పొందబోతున్నట్టు ఆ పత్రిక విశ్లేషించింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే, డోనాల్డ్ ట్రంప్ తన 200వ కార్యనిర్వాహక ఆదేశంలో 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్'గా నామకరణం చేసిన అమెరికా రక్షణశాఖ, తాను ఎనిమిది నెలల క్రితం చొరబడిన దేశంలో అతిపెద్ద చమురు క్షేత్రాలకు యజమానిగా అవతరించబోతున్నదని అర్థం. వెనెజువెలాలో అమెరికా వీరవిధేయ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగెజ్ ఈ ఒప్పదం గురించి ఏం చెబుతారో ఊహించడం కష్టం కాదు. వందబిలియన్ డాలర్ల పెట్టుబడులు, వేలాది ఉద్యోగాలతో దేశం కళకళలాడిపోతుందనీ, చమురు ఉత్పత్తి ద్విగుళం బహుళమై ఆర్థికవ్యవస్థ అద్భుతంగా తయారవుతుందన్నారు ఆమె. పూర్తి రహస్యంగా జరిగిన ఈ ఒప్పందం గురించి ట్రంప్ బయటకు చెప్పేవరకూ వెనెజువెలాలో ఎవరికీ తెలియదు. చమురు క్షేత్రాల కేటాయింపుల ద్వారా ప్రభుత్వానికి వచ్చే రాయల్టీ కూడా, వందేళ్ళక్రితం అమెరికా అనుకూల నియంత గోమేజ్ అమెరికన్ కంపెనీలనుంచి వసూలు చేసినదానికంటే ఎంతో తక్కువట. ఈ ఏడాది ఆరంభంనుంచి అమెరికా తరలించుకుపోయిన చమురుకు చెల్లించాల్సిన మొత్తాన్ని కూడా వెనెజువెలాకు ఇంకా ఇవ్వలేదట. మొన్న జూన్‌లో గత 125 ఏళ్ళలో ఎన్నడూ లేనంత భయంకరమైన భూకంపంతో వెనెజువెలా భారీగా నష్టపోయింది. వందలాదిమంది మరణించారు, నిరాశ్రయులైన వేలాది మంది ఇంకా టెంట్లలోనే జీవిస్తున్నారు. కేవలం రెండునెలల్లో కుదిరిన ఈ ఒప్పందం ఆ దేశాన్ని ఆదుకోవడం కాక, దోచుకోవడం మీద అమెరికాకు ఉన్న శ్రద్ధను తెలియచెబుతోంది. అమెరికా పెట్టిన 'నార్కో టెర్రరిజం' కేసులతో బ్రూక్లిన్ జైల్లో ఉన్న మదురో భూకంపం సమయంలో తన ప్రజలకు సంఘీభావంగా విడుదల చేసిన ఫోటో ఒకటి, ఈ చమురు ఒప్పందం కుదిరిన మర్నాడే వెలుగుచూడటం చక్కగా అతికినట్టు సరిపోయింది.ఇరాన్ యుద్ధంలో చేయి కాల్చుకొని, రేటింగ్ కూడా బాగా పడిపోయిన ట్రంప్ నవంబరులో మధ్యంతర ఎన్నికలు జరగబోతున్న తరుణంలో, ఈ ఒప్పందాన్ని ఆకాశానికి ఎత్తేస్తున్నారు. ఇప్పటికే వ్యూహాత్మక చమురునిల్వలు వేగంగా ఖాళీ అవుతూ, కేవలం ఈ ఎనిమిది నెలల కాలంలోనే మూడోవంతు ఖర్చయిన నేపథ్యంలో, వెనెజువెలా చమురు మన ఖాళీపీపాలను నింపుతుందని ట్రంప్ ప్రజలకు హామీ ఇస్తున్నారు. అమెరికన్ రిఫైనరీలకు కారుచవుక వెనెజువెలా చమురు వచ్చి చేరి, ఇంధన ధరలు విపరీతంగా తగ్గి జనానికి మేలు చేకూరుతుందని హామీ ఇస్తున్నారు. రష్యా చమురు కొనుగోలు చేస్తూ, ఉక్రెయిన్‌మీద పుతిన్ చేస్తున్న యుద్ధానికి ఇంధనం అందిస్తున్నారంటూ భారత్ సహా పలుదేశాల మీద ట్రంప్ వీరంగం వేస్తూ ఆంక్షలూ సుంకాలతో వాటికి ఆర్థికంగా ఊపిరాడకుండా చేస్తున్నారు. తానుమాత్రం వెనెజువెలా చమురుతో ఇరాన్, రష్యాల మీద యుద్ధానికి ఏ అడ్డంకులూ రాకుండా చూసుకుంటున్నారు.

# హిమాలయ 'సునామీ'కి బాధ్యులెవరు?



నేపాల్‌ను విషాదసీమగా మార్చివేసిన మహా విపత్తు అది. హిమాలయ మంచుకొండల మీది హిమనీ నదాలు కరిగిపోయాయి. నిటారుకొండలు తమ గర్వాన్ని వీడి కూలిపోయాయి. నదులు వరద జలాలతో పోటెత్తాయి. అనూహ్యామైన జలప్రళయమది. హిమాలయ ప్రాంతాల్లో సంభవించిన ఈ విపత్తు అసాధారణమైనది. విపత్తు దృశ్యాలు భయానకమైనవి. దశాబ్దానికి పైగా అంతర్జాతీయ వాతావరణ విధానంపై కృషి చేస్తున్న నేపాలీ పౌరుడిగా నేను ఈ విపత్తుకు తీవ్రంగా కలత చెందాను. ఆవేదనకు మించిన ఆగ్రహం నన్ను కుదిపివేసింది. ఇటువంటి ప్రళయం విరుచుకుపడవచ్చని శాస్త్రవేత్తలు అనేక సంవత్సరాలుగా హెచ్చరిస్తూనే ఉన్నారు. ప్రపంచ వాతావరణ కార్యాచరణలో జాప్యమే ఈ జల ప్రళయం, సందేహం లేదు. హరితగృహ వాయు ఉద్గారాలను తగ్గించి, భూతాపాన్ని పరిమితం చేయడమే లక్ష్యంగా ఉన్న ప్రపంచ వాతావరణ కార్యాచరణ విషయంలో ప్రపంచ దేశాల ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరిస్తే ఇటువంటి ప్రళయం జరిగేదేనా? ఆగస్టు 26న మంచు, నీరు, బండరాళ్లు, బురదతో కూడిన రాకాసివరద అశేష ప్రజలను కకావికలు చేసింది. లక్షలాది గృహాలను ధ్వంసం చేసింది, మార్కెట్లు, వంతెనలు, రోడ్లు రూపు లేకుండా పోయాయి. ఇటు నేపాల్‌లోను, అటు టిబెట్‌లోను విద్యుదుత్పాదన కేంద్రాలు కొట్టుకుపోయాయి. వందలాదిమంది మరణించగా, జాడలేకుండా పోయినవారు వేల సంఖ్యలో ఉన్నారు. అనూహ్య వేగంతో ఈ విధ్వంసం చోటుచేసుకున్నది. పర్వతాగ్రాలపై మొదలైన విపత్తు క్షణాల్లో దిగువ ప్రాంతాలకు వ్యాపించింది. ఈ విపత్తు ఒక వాస్తవాన్ని స్పష్టంగా ఎత్తిచూపింది: నేపాల్‌కు మరింత బలమైన ముందస్తు విపత్తు హెచ్చరిక వ్యవస్థలు, హిమనీ నదాల, అస్థిర కొండవాలుల నిరంతర మెరుగైన పర్యవేక్షణ, నేపాల్, టిబెట్‌లో ఉమ్మడి జలవనరుల పరివాహక ప్రాంతాలు ఉన్నందున ఈ రెండు హిమాలయ ప్రాంతాల మధ్య సరిహద్దు సమాచార మార్పిడి, మరీ ముఖ్యంగా ప్రాకృతిక విపత్తుల సన్నద్ధతలో భారీ ఎత్తున నిధుల వినియోగం అత్యవసరం.నేపాల్‌లో మెరుపు వరదలు ఒక మౌలిక వాస్తవాన్ని బహిర్గతం చేశాయి: సమస్య ముందస్తు హెచ్చరికల వ్యవస్థ లేకపోవడం కాదు; వాతావరణ సంక్షోభం సృష్టిస్తున్న ప్రమాదాలు ఊహింపదగిన విపత్తులకు భిన్నంగా ఉంటున్నాయి; ఫలితంగా హెచ్చరిక వ్యవస్థలు ఆ అనూహ్య అపాయాల సంభవాన్ని గ్రహించలేకపోతున్నాయి. హిమాలయ పర్వతాల పరివేష్టిత భోటేకోశి నదీ తీరస్థ ప్రాంతాలను ముంచివేసిన వరదే అందుకొక ఉదాహరణ. బురద, కొండరాళ్లతో ఆకస్మికంగా విరుచుకుపడిన ఆ వరద నది ఎగువ ప్రాంతంలోని హైడ్రా లాజికల్ కేంద్రాలను, నీటి మట్టాల పెరుగుదలను కనిపెట్టి హెచ్చరికలను జారీ చేయక ముందే ధ్వంసం చేసింది. క్రమంగా పెరిగే నీటి మట్టాల పెరుగుదలను కనిపెట్టేందుకు ఆ హెచ్చరిక వ్యవస్థను రూపొందించారు. అయితే ఆగస్టు 26న సంభవించిన రాకాసి వరద ఆ హెచ్చరిక వ్యవస్థను ముందుగానే సమూలంగా ధ్వంసం చేసింది. ఇదెలా జరిగింది? శాస్త్రవేత్తల ప్రాథమిక అంచనా ప్రకారం, ఒక భారీ హిమనీనదం కూలిపో వడం కారణంగా ఇది సంభవించింది. పర్వతాల పై భాగంలో జరిగిన ఈ సంఘటన దిగువ ప్రాంతాలలో హింసాత్మక వరదకు దారితీసింది. ఈ క్రమం తీరుతెన్నులను కచ్చితంగా నిర్ధారించేందుకు ఇంకా అధ్యయనాలు జరుగుతున్నాయి. అంతిమంగా శాస్త్రవేత్తల వివరణ ఏమైనప్పటికీ వేడెక్కిన పర్వత ప్రాంతాలలో ప్రమాదాలు ఎంత త్వరితంగా మహావిపత్తులుగా పరిణమి స్తాయనేదానికి ఈ సంఘటనే తిరుగులేని నిదర్శనం. స్పష్టంగా చెప్పాలంటే విపత్తును పసిగట్టడానికి ఉద్దేశించిన సాధనాలే దానివల్ల పనిచేయకుండా పోయాయి. ఈ వ్యత్యాసం చాలా ముఖ్యమైనది. గతంలో సంభవించిన వరదలను బట్టి రూపొందించిన ముందస్తు హెచ్చరిక వ్యవస్థ భవిష్యత్తులో తీవ్రమైన విపత్తుల ముందు సరిపోనిదిగా మిగలవచ్చు. అంతమాత్రాన ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు నిష్ప్రయోజనకరమని భావించనవసరం లేదు. అయితే వాటి పరిమితులను మనం గుర్తించాలి, అంగీకరించాలి. వాతావరణ అనుసరణ (వాతావరణ మార్పు, దాని ప్రభావాలకు అనుగుణంగా నష్టాన్ని తగ్గించడానికి సర్దుబాటు చేసుకునే ప్రక్రియ)కూ పరిమితులున్నాయి. మౌలిక సదుపాయాలను పటిష్ఠపరచుకోవడం, విపత్తుల నెదుర్కొనే సంసిద్ధతను మెరుగుపరచుకోవడం, జీవనాధారాలకు రక్షణ కల్పించడం మొదలైన చర్యలతో అటువంటి సర్దుబాటుకు నేపాల్ చాలా సంవత్సరాలుగా చురుగ్గా ప్రయత్నిస్తున్నది. అయితే వాతావరణ సంక్షోభానికి చారిత్రకంగా బాధ్యత ఉన్న పారిశ్రామిక సంపన్న దేశాల నుంచి నేపాల్‌కు తగు ఆర్థిక సహాయం లభించనే లేదు. తీవ్రమవుతున్న వాతావరణ ప్రమాదాలను, వినాశనకర వరదలను ఎదుర్కోవడానికి నేపాల్‌కు అంతర్జాతీయ సహకారం అత్యవసరం. ఎందుకంటే హిమాలయ ప్రాంతాల్లో సంభవించే ప్రాకృతిక విపత్తులు జాతీయ సరిహద్దులకు ఆవల ఉద్భవిస్తాయి. కనుక సంబంధిత దేశాల మధ్య సహకారం, సకాలంలో సమాచార మార్పిడి ఉండి తీరాలి. నేపాల్ ప్రాంతపు హిమాలయాలు వేగంగా మారుతున్నాయి. హిమనీనదాలు క్షీణిస్తున్నాయి. భూతాపం హిమాలయ ప్రాంతాల సుస్థిర పరిస్థితులను వేగంగా మార్చివేస్తోంది. ఈ సంక్షోభ పరిస్థితులు మరింత తీవ్రతరం కాకుండా నివారించడమే మొదటిపని కావాలి. దశాబ్దాలుగా శిలాజ ఇంధనాల ఆధారిత అభివృద్ధి నుంచి అత్యధికంగా ప్రయోజనం పొందిన పారిశ్రామిక సంపన్న దేశాలకు కాలుష్యకారక ఉద్గారాలను వేగంగా తగ్గించాల్సిన ప్రత్యేక బాధ్యత ఉంది. ఆ బాధ్యతను సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన ఆర్థిక వనరులు, సాంకేతికతలు ఆ దేశాలకు సమృద్ధిగా ఉన్నాయి. శిలాజ ఇంధనాల నుంచి పునరుత్పాదక ఇంధనాల వినియోగానికి వారు శీఘ్రగతిన పరివర్తన చెంది తీరాలి. అది ఆవశ్యక న్యాయబద్ధమైన మార్పు. అయితే సంపన్న దేశాలు ఈ మార్పు దిశగా ప్రస్థానించడం లేదన్నది ఒక కఠోర సత్యం.ఈ పరిస్థితుల నుంచి నేపాల్ విధిగా ఒక పాఠాన్ని నేర్చుకోవాలి. వాతావరణ సంక్షోభానికి కారణమైన ఆర్థికాభివృద్ధి నమూనాను అనుకరించకూడదు. ఒక భిన్నమైన వ్యవస్థను నిర్మించుకునే అవకాశం తనకు ఉందనే వాస్తవాన్ని నేపాల్ గుర్తించాలి. అభివృద్ధి పేరిట సహజ వనరులను విచక్షణారహితంగా ఉపయోగించుకోవడాన్ని నిలిపివేయాలి. ప్రజల జీవనోపాధులకు, పర్యావరణ సమతౌల్యతకు ప్రాధాన్యమిచ్చే ఆర్థిక వ్యవస్థను నిర్మించుకోవాలి. కాలుష్యకారక వాయువుల ఉద్గారాలలో నేపాల్ వాటా చారిత్రకంగా ఎప్పుడూ 0.1శాతం కంటే తక్కువగా ఉంటోంది. నేపాల్ తలసరి ఉద్గారాలు ప్రపంచంలోనే చాలా తక్కువ. అయినప్పటికీ తాను సృష్టించని, వాతావరణ సంక్షోభానికి ఆ దేశం అధిక మూల్యం చెల్లిస్తోంది. ఇది న్యాయవిరుద్ధం కాదూ? వాతావరణ మార్పుల ఫలితంగా అనివార్యమవుతున్న ఆర్థిక, ఆర్థికేతర నష్టాల నుంచి కోలుకునేందుకు నష్టపరిహార సహాయం అందించాలని నేపాల్, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలు పదే పదే డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవలి మహా విపత్తులో సంభవించిన అపార నష్టం నుంచి కోలుకునేందుకు విధిగా పెద్ద ఎత్తున రుణాలు తీసుకోవల్సిన పరిస్థితిని నేపాల్‌కు కల్పించకూడదు. ఇది సంపన్న దేశాల నైతిక బాధ్యత. ఇప్పటికే అందిస్తున్న అధికారిక అభివృద్ధి సహాయా నికి అదనంగా నష్ట పరిహార ఆర్థిక సహాయాన్ని అందించాలి. ఈ అదనపు సహాయాన్ని సులభ షరతులపై ఉదారపూర్వకంగా అందించాలి. సంపన్న దేశాలు ప్రస్తుతం తాము ఉపయోగించుకుంటున్న శిలాజ ఇంధనాల పరిమాణాన్ని యథావిధిగా కొనసాగించిన పక్షంలో, నేపాల్ మొదలైన అభివృద్ధి చెందుతున్న దేశాలకు అవి ఎంత అధిక మొత్తంలో నష్టపరిహార సహాయం అందించినా ప్రయోజనం ఉండదు.భోటేకోశి నదీ తీరస్థ ప్రాంతాల ప్రజలు హిమాలయాలు వేడెక్కడాన్ని కోరుకోలేదు. మంచు పర్వతాలు వేడెక్కడానికి కారణమైన శిలాజ ఇంధన ఆర్థిక వ్యవస్థను కూడా వారు ఎంచుకోలేదు. తగినంత ఆర్థిక, సాంకేతికత మద్దతు లభిస్తే పరిస్థితులకు అనుగుణంగా మారి తమ భవిష్యత్తును పదిలం చేసుకోగలరు. హిమనీనదాలు కరగడాన్ని నివారించలేక పోయినప్పటికీ అంతర్జాతీయ ఆర్థిక సహకారం, అధునాతన సాంకేతికతల తోడ్పాటుతో వాతావరణ విపత్తులను ముందుగానే పసిగట్టి, వాటి నుంచి సురక్షితంగా లేదా సాధ్యమైనంత తక్కువ నష్టంతో బయటపడగలరు. నష్టపరిహార సహాయం అనేది దాతృత్వం కాదు. తాము చేయని అపరాధానికి భారీగా నష్టపోయిన ప్రజల శ్రేయస్సు పట్ల తమ బాధ్యతగా ఆ సహాయాన్ని పారిశ్రామిక సంపన్న దేశాలు అందించాలి.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# గణపవరం మండలం గణపవరం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ సొమ్మును లబ్దిదారుల ఇంటికి నేరుగా వెళ్లి పంపిణీ చేసిన ఎమ్మెల్యే





సెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం

అభివృద్ధి--సంక్షేమం రెండు కళ్లుగా ఎన్డీఏ కూటమి పాలన సుపరిపాలన - పెంచిన పెన్షన్లతో పేదలకు భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం. పేదవాడి సంక్షేమానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కట్టుబడి పని చేస్తుందని ఉంగుటూరు నియోజకవర్గ శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం గణపవరం మండలం, గణపవరం గ్రామం లో లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి ఎమ్మెల్యే ధర్మరాజు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమం అనే రెండు కళ్లుగా రాష్ట్ర పాలన సాగుతోందని తెలిపారు. గత 26 నెలల్లో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా, పేదవాడి అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకొని ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామని అన్నారు. పేదల సంక్షేమాన్ని మరింత బలోపేతం చేసే దిశగా వృద్ధాప్య పెన్షన్‌ను రూ. 4,000/- లకు, వికలాంగుల పెన్షన్‌ను రూ. 6,000/- లకు, పూర్తి వైకల్యం కలిగిన వారికి రూ. 15,000/- లకు, తీవ్రమైన జబ్బులతో మంచానికి పరిమితమైన వారికీ రూ. 10,000/- లకు పెంచినట్లు తెలిపారు. పెంచిన పెన్షన్ సొమ్మును తెల్లవారుజామునే



లబ్ధిదారుల ఇంటి వద్దకు చేరవేసే విధంగా చర్యలు తీసుకోవడం ప్రభుత్వ సంకల్పబలం అని పేర్కొ న్నారు. ఈ సందర్భ ంగా లబ్ధిదారుల అభిప్రా యాల ను స్వయంగా అడిగి తెలుసుకున్నామని, వారు ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై హర్షం వ్యక్తం చేశారని వెల్లడిం చారు. అభివృద్ధి , సంక్షేమం రెండింటినీ సమాన ప్రాధాన్య తతో ముందుకు తీసుకెళ్తూ పేదవాడి జీవితంలో సానుకూల మార్పు తీసుకురా వడమే మా ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమ ంలో ఉంగుటూరు నియోజ కవర్గ జనసేన, తెలుగుదే శం, భారతీయ జనతా పార్టీల నాయకులు, మండల ,గ్రామ అధ్యక్షులు, కార్యకర్తలు, స్థానిక ప్రజా ప్రతి నిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ ముందస్తు జన్మదిన వేడుకల్లో భాగంగా గణపవరంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో రెల్లి కులస్తులకు వస్త్రాల పంపిణీ





సెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం

ఈ కార్యక్రమంలో పాల్గొని రెల్లి కులస్తులకు వస్త్రాలను పంపిణీ చేసి జనసైనికులను అభినం దించిన ఎమ్మెల్యే ధర్మరాజు జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమం త్రివర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ ముందస్తు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని గణపవరం మండలం గణపవరం గ్రామంలో జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో రెల్లి కులస్తులకు వస్త్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ఉంగుటూరు నియోజకవర్గ శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చేతుల మీదుగా రెల్లి కులస్తులకు వస్త్రాలను పంపిణీ చేసి, వారి కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా కేక్ కటింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ధర్మరాజు జనసేన పార్టీ నాయకులు, జనసైనికులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం గణపవరం గ్రామంలోని జనసేన పార్టీ జెండా స్థూపం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగు ణంగా ప్రజాసేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ సమాజానికి



రెల్లి కులస్తులు అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. వారి కృషి, సేవాభావం పట్ల పవన్ కళ్యాణ్ కి ప్రత్యేకమైన అభిమానం ఉందని తెలిపారు. పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జనసేన నాయకులు, జనసైనికులను ఎమ్మెల్యే ధర్మరాజు అభినందించారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహి ంచడం ద్వారా సమాజానికి మంచి సందేశాన్ని అంది స్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి జనసేన పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యక ర్తలు, వీర మహిళలు, జనసైనికులు, రెల్లి కులస్తులు, గ్రామస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆడబిడ్డలకు రక్షణే లక్ష్యం కావాలి

**-హసీనా కుటుంబానికి 10 లక్షల చెక్కును అందించిన ప్రత్తిపాటి**

చిలకలూరిపేట సెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం

ప్రియుడి చేతిలో అత్యంత దారుణంగా హత్యకు గురైన చిలకలూరిపేటకు చెందిన హసీనా కుటుం బానికి కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. ప్రభు త్వం ప్రకటించిన రూ.10 లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హసీనా కుటుంబ సభ్యులకు అందజేశారు.గత నెలలో పల్నాడు జిల్లా కారం పూడిలో హసీనా తన ప్రియుడి చేతిలో దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చిలకలూరిపేట 38వ వార్డులోని హసీనా స్వగృహానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు స్వయంగా వెళ్లి ఆమె తల్లిదండ్రులను పరామర్శించారు. బాధిత కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకుని, ప్రభుత్వం తరఫున మంజూరైన రూ.10 లక్షల ఆర్థిక సాయం చెక్కును అందజేశారు.ఆపదలో ఉన్న బాధిత కుటుంబాలకు అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. హసీనా కుటుంబానికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే ప్రత్తి పాటి పుల్లారావుకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.తమ కుమార్తె హసీనాను దారుణంగా హత్య చేసిన నిందితుడిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షిం చకుండా కఠినంగా శిక్షించాలని ఆమె తల్లి డిమాండ్ చేశారు. తమకు జరిగిన అన్యాయం మరే ఆడబిడ్డకు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళల భద్రతకు మరింత పటిష్టమైన చర్యలు చేపట్టి, ఇలాంటి ఘటనలు



పునరావృతం కాకుండా చూడాలని హసీనా తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలవడం కొంత ఊరటనిచ్చిందని, అయితే తమ కుమార్తెకు జరిగిన అన్యాయానికి న్యాయం జరగాలంటే నిందితుడికి కఠిన శిక్ష పడాల్సిందేనని కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు.

## ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



పోలవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ నూతన గృహ ప్రవేశం ఇటీవల జరిగిన సందర్భంగా మంగళవారం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఎంపీ నూతన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేఅ చిర్రి బాలరాజు ని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సాదరంగా ఆహ్వానించి, శాలువాతో సత్కరించారు. అనంతరం ఇరువురు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.

## పాయకరావుపేటలో మంత్రి వాసంశెట్టి సుభాష్ పర్యటన



అనకాపల్లి సెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం

పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్ లో మంత్రులు కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత, వాసంశెట్టి సుభాష్ సమీక్ష జలహారతి కార్యక్రమానికి జన సమీకరణ, ఏర్పాట్లు, తాగునీరు, ఆహారం సరఫరాపై సమీక్షించారు. సభకు వచ్చే ప్రజలు, కార్యకర్తలకు ఎలాంటి లోటు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం పి.ఎల్.పురం వద్ద సభా వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. వేదిక, ర్యాంప్, గ్యాలరీలను పరిశీలించి అధికారులు, నిర్వాహకులకు సూచనలిచ్చారు. పాల్గొన్న జోనల్ కో ఆర్డినేటర్ బెందాళం అశోక్, బడేటి రాధాకృష్ణ, కార్యక్రమ పరిశీలకులు బత్తుల తాతయ్య బాబు, ప్రగడ నాగేశ్వరరావు, దాడి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇదిమంచిప్రభుత్వం పేదలసేవలో -ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ పంపిణీ

సెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం





రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు మాన్యశ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు ఈ రోజు ఉంగుటూరు నియోజ కవర్గం గణపవరం గ్రామంలో గౌరవ శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమం లో కూటమి నాయకులతో కలిసి పాల్గ్గొన్నాను. ఉన్నమట్ల సునీత ఏలూ రు జిల్లా తెలుగు మహిళా ప్రధానకార్యదర్శి.

# జగన్‌వి క్రెడిట్ చోరీ రాజకీయాలు

**-ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ**

వినుకొండ సెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం



వినుకొండ లోని శావల్యాపురం ఎస్టీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్లను ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఇతర అర్హులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 65 లక్షల మందికి ప్రతి నెలా ఇంటి వద్దకే పెన్షన్లు అందిస్తూ సామాజిక భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు.గతంలో రూ.3 వేలుగా ఉన్న సామాజిక భద్రతా పెన్షన్‌ను కూటమి ప్రభుత్వం రూ.4 వేలకు పెంచిందని, దివ్యాంగుల పెన్షన్‌ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు రెట్టింపు చేశామని జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. దేశంలోనే అత్యధిక సామాజిక భద్రత కల్పించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని అన్నారు. అర్హత ఉన్నప్పటికీ పెన్షన్ అందని వారికి త్వరలో కొత్త పెన్షన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టును చంద్రబాబు ప్రభుత్వం పూర్తి చేసి కృష్ణా జలాలను అందించిందని జీవీ ఆంజనేయులు అన్నారు. ప్రాజెక్టు ద్వారా నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు, 40 లక్షల మందికి తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.వెలిగొండ ప్రాజెక్టును ఐదేళ్లలో పూర్తి చేయలేని జగన్.. చంద్రబాబు ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేసి నీటిని అందిస్తే, ఇప్పుడు ఆ ఘనత తమదేనని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. జగన్‌ది అభివృద్ధి రాజకీయాలు కాదు.. 'క్రెడిట్ చోరీ' రాజకీయాలని జీవీ ఆంజనేయులు మండిపడ్డారు. ప్రజలకు వాస్తవాలు తెలుసని, కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



## నేడు మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్యుల సమావేశం

కట్టంగూర్, సెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం :



మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఉదయం పది గంటలకు పార్టీ ముఖ్య నాయకులు, సర్పంచులు, విద్యార్థి, యువజన నాయకుల సమావేశం జరగనుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకరబోయిన వెంకన్న ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు, విద్యార్థి విభాగాల నాయకులు ఈ సమావేశానికి తప్పక హాజరుకావాలని పిలుపు నిచ్చారు. సమయానికి హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## బిజెపి నేతల అరెస్ట్, బైండోవర్




కట్టంగూర్, సెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం:

భారతీయ జనతా పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ శ్రేణులు చేసిన దాడిని ఖండిస్తూ మండల కేంద్రంలో బిజెపి శ్రేణులు నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా ఆందోళన తెలుపుతున్న బిజెపి నాయకులను కట్టంగూర్ పోలీసులు అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్‌లో బైండోవర్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి కట్టంగూర్ మండల పార్టీ అధ్యక్షుడు నీలం నాగరాజు గౌడ్, జిల్లా కిసాన్ మోర్చా నాయకులు కోమటి భాస్కర్, సీనియర్ నాయకులు ఓరుగంటి హరిబాబు, బొడ్డుపల్లి అంజిబాబు, మండల ఉపాధ్యక్షులు చెరుకు నాగరాజు, జడిగల వీరస్వామి, మండల ప్రధాన కార్యదర్శులు అయితగోని శివ, శ్రీరామ వీరేష్, బూత్ అధ్యక్షులు పబ్బు వినయ్ కుమార్, పల్లె గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హరితహారం- అన్నదానం



కట్టంగూర్, సెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం :

లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూర్ కింగ్స్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం గర్భిణులు, రోగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విశ్రాంత వీ అర్ ఓ బజ్జూరీ యాదయ్య మాధవి దంపతుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అదేవిధంగా లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కె.వి. ప్రసాద్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ జమున గర్భిణులకు పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్యాబినెట్ సెక్రటరీ నిమ్మల పిచ్చయ్య, క్లబ్ అధ్యక్షుడు గుడిపాటి శివప్రసాద్, కార్యదర్శి మంగదుడ్ల శ్రీనివాసు, ట్రెజరర్ కల్లూరు వెంకటేశ్వర్లు, డీసీ చిక్కు శేఖర్, క్లబ్ అడ్వైజర్ రెడ్డిపల్లి సాగర్, పోగుల రాములు, రాపోలు వెంకటేశ్వర్లు, మన్నెం అంజయ్య, బొడ్డుపల్లి వెంకన్న, మాదగోని రామకృష్ణ, జెల్లా అశోక్, గోశిక ఉమాపతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటికే ప్రభుత్వ భరోసా

గుంటూరు సెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం



పెన్షన్ లబ్ధిదారులకు వారి ఇళ్ల వద్దకే వెళ్లి నేరుగా పెన్షన్లు అందించాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సంపత్‌నగర్ ప్రాంతంలో నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో కమిషనర్ స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ నగదును అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు పెన్షన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి నిర్ణీత సమయంలో, పారదర్శకంగా పెన్షన్ అందేలా అధికారులు పనిచేయాలని సూచించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇంటి వద్దే పెన్షన్ పంపిణీ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

# సంక్షేమ పాలనకు ప్రతీక ఎన్టీఆర్ భరోసా





-రామచంద్రపురంలో పెన్షన్లు పంపిణీ చేసిన మంత్రి సుభాష్

-లబ్ధిదారులతో ఆప్యాయంగా మమేకమైన మంత్రి సుభాష్

-ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ పాలనకు మూలస్తంభం

రామచంద్రపురం సెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో భరోసా నింపుతున్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురం పట్టణంలోని క్లస్టర్-2 పరిధిలోని 8, 9 వార్డుల్లో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి సుభాష్, మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్ రాజుతో కలిసి పాల్గొని లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఇతర లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించిన మంత్రి వారి ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ అవసరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఒకటో తేదీనే తెల్లవారుజాము నుంచే లబ్ధిదారుల గడప వద్దకు వెళ్లి పెన్షన్లు అందించడం కూటమి ప్రభుత్వ సంక్షేమ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఆర్థిక పరిస్థితులు ఎంత సవాలుగా ఉన్నా ప్రజా సంక్షేమ కార్యక్రమాల



అమలులో ఎలాంటి రాజీ పడకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గంలో కూడా ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజల ముఖాల్లో చిరునవ్వు చూడటమే కూటమి ప్రభుత్వ అసలు లక్ష్యమని, అభివృద్ధి,సంక్షేమాన్ని సమపాళ్లలో అందిస్తూ రాష్ట్రాన్ని పురోగతి పథంలో నడిపిసున్నామని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్. ఆర్.రాజు, పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉండవల్లి శివ, ఉపాధ్యక్షులు చందమామ వాసు, క్లస్టర్-2 ఇన్‌చార్జి కంచుమర్తి బాబురావు, నారపురెడ్డి బలరాం, కట్టా నాగేశ్వరరావు, కవల నానాజీ,గడి గోవిందు, ఏలూరు ఏసుదాసు, 8 వార్డు ప్రెసిడెంట్ చిక్కాల వీరస్వామి, 9 వార్డు ప్రెసిడెంట్ తొగర శ్రీను, టేకుమూడి రామకృష్ణ, నాగదేవర నాయుడు, శ్రీను, మనోజ్,కార్యకర్తలు, లబ్ధిదారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

మార్టూరు సెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం



ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక ప్రయోజనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏపీ జేఏసీ--అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా బాపట్ల జిల్లా మార్టూరులో వాట్సాప్ డీపీ ఉద్యమం నిర్వహించారు. "సీఎం సార్.. మా డబ్బులు మాకివ్వండి" అనే నినాదంతో మార్టూరు మండల కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ--అమరావతి జిల్లా చైర్మన్ సి.హెచ్. సురేష్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగులు చేపడుతున్న ఉద్యమం ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే కోరుతున్నామని స్పష్టం చేశారు. గత అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యోగులకు సుమారు రూ.40 వేల కోట్ల బకాయిలు ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొందని, వాటిని ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టత ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, ఏరియర్స్ బిల్లుల కారణంగా ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను కాలయాపన చేయకుండా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ, ఐఆర్, డీఏ బకాయిలతో పాటు ఉద్యోగుల హక్కులకు సంబంధించిన అన్ని అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి చర్చలకు ఆహ్వానించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మార్టూరు మండల డిప్యూటీ ఎంపీడీఓ సీతా మహా లక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ ఎల్. నాగలక్ష్మి, ఆర్ఐ అశోక్, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, వీఆర్ఏలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాచర్ల దాహార్తికి శాశ్వత పరిష్కారం

-రూ.153.47 కోట్లతో ఇంటింటికీ కృష్ణమ్మ జలాలు

మాచర్ల సెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం



మాచర్ల పట్టణ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. అమృత్ 2.0, యూఐడీఎఫ్ నిధులతో రూ.153.47 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న తాగునీటి ప్రాజెక్టుకు మాచర్ల శ్రీనివాస మహల్ సెంటర్‌లో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శంకుస్థాపన చేసి పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరాను పెంచడమే లక్ష్యంగా ఈ భారీ ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు. వరికపూడిశెల, జల్‌జీవన్ మిషన్, అమృత్ పథకాల ద్వారా నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్యల పరిష్కారానికి పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ మాచర్లలో ప్రతి ఇంటికీ కృష్ణమ్మ జలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా మంచినీటి సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. మాచర్ల సమగ్ర అభివృద్ధిలో భాగంగా 500 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.ఆరు దశాబ్దాలుగా రైతులు ఎదురుచూస్తున్న వరికపూడిశెల ప్రాజెక్టును సాధించి తీరుతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నాగార్జునసాగర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంతో పాటు కేంద్ర విద్యాలయం, జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల వంటి విద్యాసంస్థలను నియోజకవర్గానికి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. తాగునీరు, సాగునీరు, పరిశ్రమలు, విద్య, పర్యాటక రంగాల్లో మాచర్లను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీ, ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

# గురజాలలో వైసీపీకి షాక్ పిడుగురాళ్లలో 200 కుటుంబాల చేరిక

-చైర్‌పర్సన్, ఏడుగురు కౌన్సిలర్లూ టీడీపీ బాట
-అభివృద్ధి అజెండాతో కూటమి ముందుకు
-వైసీపీ నుంచి టీడీపీలోకి కీలక నేతలు
-గురజాలలో మారుతున్న రాజకీయ సమీకరణాలు

గురజాల సెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం

గురజాల నియోజకవర్గంలో వైసీపీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. పిడుగురాళ్లలో సుమారు 200 కుటుంబాలు టీడీపీలో చేరగా, గురజాల మున్సిపల్ చైర్‌పర్సన్ బడే జానీతో పాటు ఏడుగురు కౌన్సిలర్లు టీడీపీ తీర్థం పుచ్చుకోవడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. పిడుగురాళ్ల పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైసీపీకి చెందిన గురజాల మున్సిపల్ చైర్‌పర్సన్ బడే జానీతో పాటు ఏడుగురు కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. వీరితో పాటు గురజాల మండలానికి చెందిన పలు వైసీపీ కుటుంబాలు సైతం టీడీపీ గూటికి చేరాయి. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారిస్తున్న వేళ గురజాలలో చోటుచేసుకున్న ఈ చేరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



ముఖ్యంగా ఒకేసారి సుమారు 200 కుటుంబాలు టీడీపీలో చేరడం, మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు ఏడుగురు కౌన్సిలర్లు పార్టీ మారడం స్థానిక రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసే టీడీపీలో చేరుతున్నామని చైర్‌పర్సన్ బడే జానీ, కౌన్సిలర్లు తెలిపారు. ప్రజా సేవలో మరింత చురుగ్గా భాగస్వా ములయ్యేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఎనియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు తమ నిర్ణయానికి ప్రధాన కారణ మని పేర్కొన్నారు. మరోవైపు, ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ ఇరు ప్రధాన పార్టీలు తమ రాజకీయ బలాన్ని పెంచుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు, కుటుంబాలు టీడీపీలోకి రావడం గురజాల నియోజకవర్గంలో అధికార పార్టీ బలం మరింత పెరుగుతోందనే సంకేతాలను ఇస్తోందని రాజకీయ వర్గాలు భావిస్తు న్నాయి. అయితే, వరుసగా జరుగుతున్న పార్టీ మార్పుల వెనుక స్థానిక రాజకీయ పరిస్థితులు, నాయకత్వంపై ఉన్న అంచనాలు, అభివృద్ధి అంశాలు ఎంతవరకు ప్రభావం చూపుతు న్నాయన్నది రానున్న రోజుల్లో స్పష్టమయ్యే అవకాశం ఉంది. ఎన్నికల వేళ ఈ చేరికలు ఏ మేరకు రాజకీయ ప్రభావాన్ని చూపుతాయనేది ఆసక్తికరంగా మారింది.

## పింఛన్‌తో పేదలకు భరోసా

పిట్టలవానిపాలెం సెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం



పిట్టలవానిపాలెం మండలం సంగుపాలెం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి డాక్టర్ గ్లోరి యానెట్ సచివాలయ సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గ్లోరి యానెట్ మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బలహీన వర్గాలకు గౌరవప్రదమైన జీవనం అందించడమే లక్ష్యంగా పింఛను మొత్తాన్ని పెంచినట్లు తెలిపారు. ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం వంటి భారీ ప్రాజెక్టులు చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యమవుతాయని అన్నారు. బాపట్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని డాక్టర్ గ్లోరి యానెట్ తెలిపారు. ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

## బీమాకు ఈ-క్రాప్ కీలకం



కర్లపాలెం సెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం

కర్లపాలెం మండలంలోని యాజలి, బుద్దాం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి సుమంత్‌కుమార్ పాల్గొని రైతులకు పంటల నమోదు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. సెప్టెంబర్ 15వ తేదీలోపు రైతులంతా గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. పంటల బీమా పొందిన రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్‌తో పాటు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ-క్రాప్, ఈ-కేవైసీ పూర్తయినప్పుడే పంటల బీమా పరిహారం, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సొంత భూమి కలిగిన రైతులు ఫార్మర్ ఐడీ (APFR) తప్పనిసరిగా పొందాలని, ప్రభుత్వానికి పంట ఉత్పత్తులను మద్దతు ధరకు విక్రయించడంతో పాటు వివిధ ప్రభుత్వ సేవలు పొందేందుకు ఇది అవసరమని తెలిపారు. రైతులు 'APAIMS 2.0' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఈ-క్రాప్ నమోదు, మద్దతు ధరలు, వాతావరణ సమాచారం, భూసార పరీక్షలు, చీడపీడల హెచ్చరికలు, ఏఐ ఆధారిత వ్యవసాయ సలహాలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి భాగ్యలక్ష్మి, ఎంపీఈఓ యామిని, గ్రామ వ్యవసాయ సహాయకుడు తిరుమలేష్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కృషికి గవర్నర్ కితాబు

బాపట్ల సెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం



ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వాల నమోదులో బాపట్ల జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపినందుకు జిల్లా కలెక్టర్ వి. వినోద్‌కుమార్‌కు అరుదైన గౌరవం దక్కింది. విజయవాడ రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా కలెక్టర్ గోల్డ్ మెడల్‌ను స్వీకరించారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెడ్‌క్రాస్ కార్యకలాపాలను విస్తృతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన.. సేవాభావాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందించారు. యువత, ప్రజలను రెడ్‌క్రాస్ సేవల్లో భాగస్వాములను చేస్తూ సభ్యత్వాల నమోదును భారీగా పెంచడంలో కీలకపాత్ర పోషించారు. రెడ్‌క్రాస్ సేవలను కేవలం పట్టణాలకే పరిమితం చేయకుండా గ్రామస్థాయిలోనూ విస్తరించేందుకు కలెక్టర్ చేపట్టిన కార్యక్రమాలు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయి. ప్రజల్లో సేవాభావాన్ని పెంపొందిస్తూ, విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో సేవలందించేలా స్వచ్ఛంద కార్యకర్తల భాగస్వామ్యాన్ని పెంచారు. కలెక్టర్ అంకితభావం, నాయకత్వ పటిమను గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అభినందించారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత గవర్నర్ చేతుల మీదుగా మూడోసారి అవార్డు అందుకోవడం విశేషంగా నిలిచింది. బాపట్ల జిల్లాను రెడ్‌క్రాస్ సభ్యత్వాల నమోదులో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపడంతో జిల్లావ్యాప్తంగా కలెక్టర్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

## లోకేష్ పర్యటనకు సన్నాహాలు

సత్తెనపల్లి సెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం



సెప్టెంబర్ 2న నరసరావుపేటలో మంత్రి నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. సత్తెనపల్లి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ పర్యటనకు సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సంఘీభావం తెలిపేలా జనసమీకరణ చేపట్టాలని సూచించారు. కార్యక్రమ ఏర్పాట్లు, నాయకులు--కార్యకర్తల సమన్వయం, జనసమీకరణపై నాయకులతో చర్చించారు. పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేసి మంత్రి నారా లోకేష్ పర్యటనను ఘనవిజయవంతం చేయాలని నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు.

## భవన కార్మికులకు చేయూత

కర్లపాలెంసెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం



భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భవన నిర్మాణ సంక్షేమ నిధి ద్వారా ఇద్దరు భవన నిర్మాణ కార్మికులకు నిత్యావసర సరుకులు, బియ్యం, కూరగాయలను పంపిణీ చేశారు. తహసీల్దార్ రవీంద్రబాబు చేతుల మీదుగా ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పిట్టు కాసులరెడ్డి మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన ఇద్దరు భవన నిర్మాణ కార్మికులకు నిత్యావసర సరుకులు, బియ్యం, కూరగాయలు అందిస్తు న్నట్లు తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ నిధిని సద్వినియోగం చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో షేక్ కరీముల్లా, యూనస్‌ఖాన్, భక్షిఖాన్, సమ్మద్, అయాన్ బ్యాగ్ వర్క్ అధినేత తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు వ్యవసాయ అధికారుల సూచనలు



ముండ్లమూరు సెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం

ముండ్లమూరు మండలంలోని భీమవరం, ఈదర గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎ. తిరుమలరావు మాట్లాడుతూ రైతులు తాము సాగు చేసిన ప్రతి పంటను ఈ-క్రాప్ బుకింగ్ ద్వారా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. పీఎం కిసాన్ పథకానికి అర్హులైన రైతులు ప్రతి సంవత్సరం ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ-కేవైసీ కోసం సీఎస్‌సీ కేంద్రం లేదా రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అర్హులైన కౌలు రైతులు సంబంధిత వీఆర్‌ఓను సంప్రదించి కౌలు కార్డులు పొందాలని పేర్కొన్నారు. ప్రతి రైతు ఫార్మర్ ఐడీ కలిగి ఉండాలని, ఫార్మర్ ఐడీ ఉంటేనే వివిధ వ్యవసాయ పథకాలకు అర్హత లభిస్తుందని వ్యవసాయ అధికారి తెలిపారు. ఫార్మర్ ఐడీ కోసం రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అనంతరం భీమవరం, ఈదర గ్రామాల్లోని మిరప, మొక్కజొన్న పంటలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. పంటల పరిస్థితి, సాగు విధానాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు అంజలి, ఎంపీఈఓ రాకేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హనుమంతరావు, వెంకటేశ్వరరెడ్డి, కళ్యాణి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యతే ప్రధానం



గుంటూరుసెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం

గుంటూరు నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బ్రాడీపేట, కాకుమానువారి వీధి, లాంచెస్టర్ రోడ్, సంపత్‌నగర్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించారు.సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రారంభించిన పనులు పెండింగ్‌లో లేకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ వ్యర్థాలను వెంటనే తొలగించి, రోడ్లు--డ్రైన్ల లెవెల్స్ సక్రమంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. బ్రాడీపేటలో తాగునీటి శాంపిల్స్ సేకరణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎమినిటీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఎస్ఈని ఆదేశించారు. రోడ్లపై నిర్మాణ సామగ్రి వేసిన వారికి పనులు నిలిపివేయాలని నోటీసులు ఇవ్వాలని ఏసీపీకి సూచించారు. నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలని, ఖాళీ స్థలాలను శుభ్రం చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. లాంచెస్టర్ రోడ్ ప్రధాన డ్రైన్‌లో పూడికను తొలగించాలని సూచించారు.

## ఇంటింటికీ చంద్రన్న భరోసా



చీరాల సెప్టెంబర్ 01 వార్త సాక్ష్యం

చీరాల నియోజకవర్గంలో ఇంటింటికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం తెల్లవారుజామునే ప్రారంభమైంది. చీరాల మున్సిపాలిటీ 1వ వార్డు రాంనగర్, రంగారావు కాలనీలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్లు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. ప్రతి ఇంట్లో చిరునవ్వు చూడడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని లబ్ధిదారులతో అన్నారు. చీరాల నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామ గ్రామాన అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, సజ్జ హేమలత, వార్డు అధ్యక్షులు, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బిజినెస్

## రోజుకు 5 నిమిషాలు.. నెలకు రూ.8 లక్షలు!
## ఆ కుర్రాడి ఆలోచన ఇప్పుడు రూ.5 లక్షల కోట్ల సామ్రాజ్యం




రోజుకు ఐదు నిమిషాలు.. అంతే పని. కానీ నెలకు 10 వేల డాలర్లు సంపాదించాలి! ఈ మాట వింటే ఎవరికైనా నవ్వొస్తుంది. కాలేజీ రోజుల్లో ఈ లక్ష్యాన్ని పెట్టుకున్నాడు ఓ యువకుడు. స్నేహితులు కూడా అతడిని చూసి ఆశ్చర్యపోయారు. కానీ అతడు మాత్రం వెనక్కి తగ్గలేదు. ఐదు నిమిషాల పని అంటే ఐదు నిమిషాలే.. ఆ సమయంలో ఏం ఆలోచించాలో నిర్ణయించుకున్నాడు. ఆ ఆలోచన ఓ చిన్న పరికరానికి దారి తీసింది. అదే అతడి జీవితాన్ని మార్చేసింది.ఆ యువకుడే మసయోషి సన్. నేడు సాఫ్ట్‌బ్యాంక్ వ్యవస్థాపకుడిగా ప్రపంచ టెక్నాలజీ రంగంలో అత్యంత ప్రభావవంతమైన పెట్టుబడిదారుల్లో ఒకరు. 2026 సెప్టెంబరు 1 నాటికి ఫోర్బ్స్ అంచనా ప్రకారం ఆయన సంపద 63.2 బిలియన్ డాలర్లు. అంటే మన కరెన్సీలో దాదాపు రూ.5.3 లక్షల కోట్లు. కానీ ఈ స్థాయికి ఆయన ప్రయాణం మాత్రం కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం, బెర్క్లీలో ఓ విద్యార్థిగా ఉన్నప్పుడే మొదలైంది.

**-ఐదు నిమిషాల ఆలోచన..**

1970ల చివర్లో బెర్క్లీలో ఆర్థికశాస్త్రం చదువుతున్న సన్ తనకు తానే ఓ సవాల్ విసిరుకున్నారు. రోజుకు ఐదు నిమిషాలు మాత్రమే కేటాయించి నెలకు 10 వేల డాలర్లు సంపాదించాలి. ఉద్యోగం చేస్తే అది సాధ్యం కాదని ఆయనకు తెలుసు. అందుకే ఓ వినూత్న ఆదాయ మార్గం కోసం ఆలోచించారు. ఆ ఐదు నిమిషాల్లో ఓ ఆవిష్కరణ చేయాలని నిర్ణయించుకున్నారు. అలా ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌లేటర్ ఆలోచన వచ్చింది. బెర్క్లీలోని పరిశోధకులు, ప్రొఫెసర్ ఫారెస్ట్ మోజర్ సహకారంతో దాన్ని అభివృద్ధి చేశారు. చివరకు ఆ పరికరాన్ని జపాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ సంస్థ షార్ప్‌కు 1.7 మిలియన్ డాలర్లకు విక్రయించారు. అక్కడితో ఆగలేదు. ఉపయోగించిన వీడియో గేమ్ యంత్రాలను జపాన్ నుంచి అమెరికాకు తీసుకొచ్చి డార్మిటరీలు, రెస్టారెంట్లలో ఏర్పాటు చేసే మరో వ్యాపారం ద్వారా సుమారు 1.5 మిలియన్ డాలర్లు సంపాదించారు. కేవలం 18 నెలల్లో మొత్తం 3.2 మిలియన్ డాలర్లు. ఐదు నిమిషాల ఆలోచనకు ఇది తొలి ఫలితం.

### కార్ల రంగంలో సంచలనం.. చేతులు కలిపిన నిస్సాన్, హోండా




ఆటోమొబైల్ రంగంలో దశాబ్దాలుగా తీవ్రమైన ప్రత్యర్థులుగా ఉన్న జపాన్ దిగ్గజాలు నిస్సాన్, హోండా సంచలన నిర్ణయం తీసుకున్నాయి. భవిష్యత్ తరం వాహనాలకు అత్యంత కీలకమైన సాఫ్ట్‌వేర్, ఎలక్ట్రానిక్ భాగాలను కలిసి అభివృద్ధి చేసేందుకు ఒక వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఆధునిక కార్ల తయారీలో పెరుగుతున్న సాఫ్ట్‌వేర్ ప్రాధాన్యం, దాని అభివృద్ధికి అవుతున్న భారీ ఖర్చులను అధిగమించేందుకు ఈ రెండు కంపెనీలు ఒక్కటయ్యాయి. ఈ భాగస్వామ్యం ద్వారా అభివృద్ధి ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు తయారీ సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం.. నిస్సాన్, హోండా తమ తదుపరి తరం 'సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వెహికల్స్' (ఎస్‌డీవీ) కోసం కీలకమైన సాంకేతికతను పంచుకోనున్నాయి. ఇందులో భాగంగా వాహనాల్లోని వివిధ కార్యకలాపాలను నియంత్రించే పలు ఎలక్ట్రానిక్ కంట్రోల్ యూనిట్లు (ఈసీయూలు), కార్ల కోసం ప్రత్యేకమైన ఆపరేటింగ్ సిస్టమ్ (ఓఎస్), మిడిల్‌వేర్, వెహికల్ కంట్రోల్ సాఫ్ట్‌వేర్‌లను సంయుక్తంగా అభివృద్ధి చేస్తాయి. ఈ టెక్నాలజీలను ఇరు కంపెనీలు తమ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఆర్కిటెక్చర్‌లో పొందుపరుస్తాయి. 2029 ఆర్థిక సంవత్సరం నుంచి మార్కెట్లోకి రానున్న తమ కొత్త మోడల్ కార్లలో ఈ ఉమ్మడి టెక్నాలజీని ఉపయోగించాలని ప్రణాళికలు సిద్ధం చేశాయి. ఆధునిక కార్లు కేవలం ఇంజిన్లు, చక్రాలతో నడిచే యంత్రాలు కాకుండా, 'చక్రాలపై నడిచే కంప్యూటర్లు'గా మారుతున్నాయి. కారు భద్రత, వినోదం, పనితీరు వంటి అనేక అంశాలు ఇప్పుడు సాఫ్ట్‌వేర్‌పైనే ఆధారపడి ఉన్నాయి. ఈ నేపథ్యంలో సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి భారీగా పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది. ఈ భారాన్ని తగ్గించుకునేందుకే నిస్సాన్, హోండా ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఉమ్మడి స్పెసిఫికేషన్లతో ఈసీయూలు, ఓఎస్ వంటి వాటిని అభివృద్ధి చేయడం ద్వారా, రెండు కంపెనీలు తమ వనరులను పంచుకోవచ్చు. దీనివల్ల భారీ ఎత్తున ఉత్పత్తి చేయడం ద్వారా ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి.

## ఆగస్టు నెలలో అమ్మకాలు డౌన్.. డీలాపడిన మారుతి షేర్లు




ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం మారుతి సుజుకి ఇండియాకు ఆగస్టు నెల అమ్మకాల్లో నిరాశ ఎదురైంది. జూలై నెలతో పోలిస్తే మొత్తం అమ్మకాలు 10 శాతం తగ్గడంతో, దాని ప్రభావం స్టాక్ మార్కెట్‌పై స్పష్టంగా కనిపించింది. మంగళవారం నాటి ట్రేడింగ్‌లో కంపెనీ షేర్లు 4 శాతానికి పైగా పతనమై నిఫ్టీలో టాప్ లూజర్‌గా నిలిచాయి. మంగళవారం మధ్యాహ్నం ట్రేడింగ్‌లో మారుతి సుజుకి ఇండియా షేరు 4 శాతం నష్టంతో రూ. 13,010 వద్ద కొనసాగింది. ఆగస్టు నెలలో కంపెనీ మొత్తం 2,19,220 యూనిట్లను విక్రయించింది. అంతకుముందు జూలై 2026లో రికార్డు స్థాయిలో 2,41,421 యూనిట్ల అమ్మకాలను నమోదు చేయడంతో, నెలవారీగా అమ్మకాలు తగ్గినట్లు స్పష్టమవుతోంది. ఈ ప్రభావంతో నిఫ్టీ ఆటో ఇండెక్స్ కూడా 0.6 శాతం మేర నష్టపోయింది. అయితే, నెలవారీగా అమ్మకాలు తగ్గినా, వార్షికంగా చూస్తే మాత్రం మారుతి సుజుకి బలమైన వృద్ధిని కనబరిచింది. గతేడాది ఆగస్టులో 1,31,278 యూనిట్లుగా ఉన్న డొమెస్టిక్ ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు, ఈ ఏడాది ఆగస్టులో 1,76,971 యూనిట్లకు పెరిగాయి. ముఖ్యంగా, యుటిలిటీ వెహికల్స్ (యూవీ) విభాగం అమ్మకాల జోరును కొనసాగించింది. బ్రెజా, ఎర్టిగా, గ్రాండ్ విటారా, ఫ్రాంక్స్ వంటి మోడళ్లు ఉన్న ఈ విభాగంలో అమ్మకాలు గతేడాది ఆగస్టులోని 54,043 యూనిట్ల నుంచి ఈసారి 79,045 యూనిట్లకు పెరిగాయి.

## దులీప్ ట్రోఫీ: రాణించిన వైభవ్ సూర్యవంశీ, కిషన్... ఫైనల్లోకి దూసుకెళ్లిన ఈస్ట్ జోన్




దులీప్ ట్రోఫీ సెమీ ఫైనల్లో ఈస్ట్ జోన్ ఘన విజయం సాధించింది. డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్‌ను నాలుగు వికెట్ల తేడాతో మట్టికరిపించి ఫైనల్లోకి అడుగుపెట్టింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో జట్టును విజయతీరాలకు చేర్చాడు.159 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఈస్ట్ జోన్‌కు యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ (43 బంతుల్లో 43) మెరుపు ఆరంభాన్ని అందించాడు. అయితే, సెంట్రల్ జోన్ బౌలర్ హర్ష్ దూబే నాలుగు వికెట్లు పడగొట్టి ఈస్ట్ జోన్‌పై ఒత్తిడి పెంచాడు. ఈ దశలో సంయమనంతో ఆడిన కెప్టెన్ ఇషాన్ కిషన్ (41 బంతుల్లో 39 నాటౌట్) జట్టుకు విజయాన్ని ఖరారు చేశాడు. అతనికి మహమ్మద్ షమీ (8 నాటౌట్) సహకరించాడు. అంతకుముందు, సెంట్రల్ జోన్ తమ రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 158 పరుగులకే కుప్పకూలింది. ఈస్ట్ జోన్ బౌలర్లు ముకేశ్ కుమార్ 4 వికెట్లతో, మహమ్మద్ షమీ 3 వికెట్లతో ప్రత్యర్థి బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీశారు. కాగా, ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఇరు జట్లు 266 పరుగుల వద్ద సమానంగా నిలవడం విశేషం. ఈ విజయంతో, గత ఏడాది ఛాంపియన్‌ను టోర్నీ నుంచి నిష్క్రమింపజేసి, ఈస్ట్ జోన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది.

# స్పోర్ట్స్

### ఆఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టు ఎంపిక.. బుమ్రా రీఎంట్రీ, శ్రేయస్‌కే కెప్టెన్సీ




ఆఫ్ఘనిస్థాన్‌తో స్వదేశంలో జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మంగళవారం టీమిండియా జట్టును ప్రకటించింది. శ్రేయస్ అయ్యర్‌కే కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించగా, తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. గాయం కారణంగా కొంతకాలంగా జట్టుకు దూరమైన స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఈ సిరీస్‌తో పునరాగమనం చేయడం అభిమానులకు శుభవార్త. అయితే, జస్‌ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్ రెడ్డిల ఎంపిక వారి ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుందని బీసీసీఐ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ సిరీస్‌కు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుండగా, సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో మ్యాచ్‌లు జరగనున్నాయి. జింబాబ్వే పర్యటనకు ఎంపిక కాని వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ తిరిగి జట్టులోకి వచ్చాడు. అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, శివమ్ దూబే, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి వంటి ఆటగాళ్లు జట్టులో తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. జింబాబ్వే పర్యటనలో భాగమైన ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్‌లకు ఈసారి చోటు దక్కలేదు. ఇక, హార్దిక్ పాండ్యాకు జట్టులో స్థానం లభిస్తుందన్న ఊహాగానాలకు తెరదించుతూ, సెలక్టర్లు అతడిని పరిగణనలోకి తీసుకోలేదు.

## పాక్ క్రికెట్‌లో ప్రకంపనలు.. సెలక్షన్ కమిటీకి మిస్బా ఉల్ హక్ రాజీనామా



పాకిస్థాన్ క్రికెట్‌లో సంక్షోభం మరింత ముదురుతోంది. ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో ఘోర పరాజయాల నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తీసుకున్న కఠిన చర్యలపై అసంతృప్తితో, మాజీ కెప్టెన్ మిస్బా ఉల్ హక్ పురుషుల సెలక్షన్ కమిటీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ అనూహ్య పరిణామం పాక్ క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది .ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్‌ను పాకిస్థాన్ ఇప్పటికే 0–2తో కోల్పోయింది. లార్డ్స్‌లో జరిగిన రెండో టెస్టులో 194 పరుగుల తేడాతో ఓటమి పాలైన తర్వాత, పీసీబీ జట్టులో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఏకంగా ఏడుగురు ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించింది. మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్, సల్మాన్ అఘా, అలీ ఉస్మాన్, అమీర్ జమాల్, అవాజ్ జాఫర్, ఖుర్రం షాజాద్‌లను రిలీజ్ చేసింది. వీరి స్థానంలో ఏడుగురు కొత్తవారిని జట్టులోకి తీసుకుంది.ఈ మార్పులు ఆటగాళ్లకే పరిమితం కాలేదు. జట్టు పేలవ ప్రదర్శనకు బాధ్యత వహించాలేనంటూ, హెడ్ కోచ్ సర్ఫరాజ్ ఖాన్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌లను కూడా బాధ్యతల నుంచి తప్పించింది. వీరి స్థానంలో వైట్-బాల్ హెడ్ కోచ్ మైక్ హెస్సన్, యాసిర్ నోఫ్ఫిలకు మిగిలిన టూర్‌కు బాధ్యతలు అప్పగించింది. కొద్ది రోజుల క్రితమే టెస్ట్ కెప్టెన్సీ నుంచి షాన్ మసూద్‌ను తప్పించి, బాబర్ అజామ్‌కు తిరిగి పగ్గాలు అప్పగించిన విషయం తెలిసిందే.పీసీబీ తీసుకున్న ఈ అసాధారణ నిర్ణయాల పట్ల తీవ్ర అసంతృప్తికి గురైన మిస్బా ఉల్ హక్, సెలక్షన్ కమిటీ నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాడు. ఈ ఏడాది మార్చిలో ఆకిబ్ జావేద్, సర్ఫరాజ్ అహ్మద్, అసద్ షఫీక్‌లతో కలిసి మిస్బా నలుగురు సభ్యుల సెలక్షన్ కమిటీలో నియమితులయ్యారు. సెలక్షన్ కమిటీతో పాటు, లాహోర్‌లోని నేషనల్ క్రికెట్ అకాడమీలో బ్యాటింగ్ కన్సల్టెంట్ పదవికి కూడా అతడు రాజీనామా చేసినట్లు సమాచారం. అయితే, పీసీబీ అతడి రాజీనామాను ఇంకా అధికారికంగా ఆమోదించలేదు. 2017లో ఆటకు వీడ్కోలు పలికిన మిస్బా, గతంలో పాకిస్థాన్ జట్టుకు హెడ్ కోచ్‌గా, చీఫ్ సెలక్టర్‌గా కూడా పనిచేశాడు. తాజా పరిణామాలతో పాకిస్థాన్ క్రికెట్‌లో నెలకొన్న గందరగోళం మరింత స్పష్టంగా కనిపిస్తోంది.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్షము
Editor : SAGINALA RAVI KUMAR తెలుగు దిన పత్రిక

బుధవారం 02 సెప్టెంబర్ 2026

# రష్మిక మందన్న ఫ్యాన్స్‌కు గుడ్‌న్యూస్

# ‘మైసా’ రిలీజ్ డేట్ వచ్చేసింది!




నటి రష్మిక మందన్న అభిమానులకు గుడ్‌న్యూస్. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ ‘మైసా’ విడుదల తేదీ ఖరారైంది. ఈ ఏడాది నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం మంగళవారం ప్రకటించింది. దర్శకుడు రవీంద్ర పుల్లె తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని ‘అన్‌ఫార్ములా ఫిల్మ్స్’ నిర్మిస్తోంది. సోషల్ మీడియా వేదికగా విడుదల తేదీని ప్రకటించిన చిత్రబృందం.. రష్మికను ఇంతకుముందెన్నడూ చూడని కొత్త రూపంలో ప్రేక్షకులు చూడబోతున్నారని పేర్కొంది. ఇటీవల ‘మైసా’ షూటింగ్‌లో కీలకమైన అండర్‌వాటర్ యాక్షన్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. రష్మిక పాల్గొన్న ఈ సన్నివేశం చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని తెలుస్తోంది. ఈ విషయాన్ని నిర్మాత అజయ్ సాయిపురెడ్డి కూడా సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. కేరళలోనూ సినిమా కోసం సుదీర్ఘ షెడ్యూల్‌ను చిత్రబృందం పూర్తి చేసింది. ఈ షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించారు. స్టంట్ మాస్టర్ కెచా ఖంపక్డీ ఈ యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ చేశారు. రష్మిక కూడా ఈ సన్నివేశాల్లో కీలకంగా పాల్గొన్నట్లు సమాచారం. ‘మైసా’లో రష్మిక గిరిజన గోండ్ యువతి పాత్రలో కనిపించనున్నారు. భావోద్వేగాలతో పాటు శారీరకంగా కఠినమైన యాక్షన్ సన్నివేశాలు చేయాల్సిన పాత్ర కావడంతో ఆమె ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో నిర్వహించిన స్టంట్, కంబాట్ బూట్‌క్యాంప్‌లో ఆమె శిక్షణ పొందారు. రోజుకు ఎనిమిది గంటలకు పైగా సాధన చేసినట్లు చిత్రబృందం తెలిపింది. ఈ సినిమాలో ఈశ్వరీరావు, గురు సోమసుందరం, రావు రమేశ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. శ్రేయాస్ పి.కృష్ణ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. జేక్స్ బిజోయ్ సంగీతం సమకూరుస్తున్నారు. అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ ఆండీ లాంగ్ యాక్షన్ సన్నివేశాలను పర్యవేక్షిస్తున్నారు.



## రోమాంచకం మూవీ.. లవ్-కామెడీ ఎంటర్‌టైనర్‌పై భారీ అంచనాలు

అర్జున్ రెడ్డి’ చిత్రంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ఆయన సమర్పణలో, భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ప్రణయ్ రెడ్డి నిర్మించిన తాజా చిత్రం ‘రోమాంచకం’. ‘మేము ఫేమస్’, ‘గోదారి గట్టుపైన’ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న యువ హీరో సుమంత్ ప్రభాస్ ఈ సినిమాలో కథానాయకుడిగా నటిస్తుండగా, అనంతిక సనిల్‌కుమార్ హీరోయిన్‌గా నటిస్తోంది. వేణు గోపాల్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం యువతను లక్ష్యంగా చేసుకున్న లవ్-కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కింది. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలకు సోషల్ మీడియాలో మంచి స్పందన లభించడంతో సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. సెప్టెంబరు 3న విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో దూకుడు పెంచింది. ఇందులో భాగంగా ఇటీవలే గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ‘రౌడీ హీరో’ విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరు కావడంతో చిత్రంపై హైప్ భారీగా పెరిగింది. అంతేకాదు, చిత్రబృందం ప్రెస్ మీట్లు, కాలేజ్ ఫెస్ట్ లతో దూసుకెళుతోంది. విజయవాడలోనూ చిత్ర యూనిట్ సందడి చేసింది. ఇదిలా ఉండగా, ‘రోమాంచకం’ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ సినిమాకు U/A సర్టిఫికెట్ జారీ చేసింది. చిత్ర నిడివిని 1 గంట 42 నిమిషాల 40 సెకన్లుగా ఖరారు చేశారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు.



### ఆ సినిమా కోసం

## 150 మీటర్ల ఎత్తు నుంచి దూకాను- మాళవిక మోహనన్



హీరో కార్తి నటిస్తున్న స్పై థ్రిల్లర్ ‘సర్దార్ 2’ సెట్స్‌లో తనకు ఎదురైన భయంకరమైన అనుభవాన్ని నటి మాళవిక మోహనన్ పంచుకున్నారు. ఈ చిత్ర షూటింగ్ మొదటి రోజే ఓ భారీ యాక్షన్ సీన్‌లో పాల్గొనాల్సి వచ్చిందని, అది తనను తీవ్రంగా భయ పెట్టిందని ఆమె తెలిపారు. ‘సర్దార్ 2’ ఆడియో విడుదల కార్యక్రమంలో ఆమె ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. తన అనుభవాన్ని వివరిస్తూ, “నాకు షూటింగ్ మొదటి రోజే పెద్ద షాక్ తగిలింది. తొలిరోజే ఒక స్టంట్ సీక్వెన్స్ చిత్రీకరించారు. అందులో భాగంగా నేను దాదాపు 100 నుంచి 150 మీటర్ల ఎత్తు నుంచి కిందకు దూకాల్సి వచ్చింది. రోప్స్ వంటి భద్రతా ఏర్పాట్లు ఉన్నప్పటికీ, అంత ఎత్తు నుంచి ఫ్రీ ఫాల్ జంప్ చేయడం చాలా భయమేసింది. నా కెరీర్‌లో ఏ సినిమా సెట్‌లోనూ ఇంత భయానకమైన మొదటి రోజును నేను ఎప్పుడూ ఎదుర్కోలేదు” అని మాళవిక అన్నారు. ఈ సందర్భంగా హీరో కార్తి మాట్లాడుతూ, ఈ చిత్రం ఒక బలమైన సామాజిక సందేశాన్ని అందిస్తుందని తెలిపారు. “చాలామంది ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లలో నీరు తాగే అలవాటును కొనసాగిస్తూ ఉండవచ్చు. కానీ ఈ సినిమా చూశాక, మీరు ఆ విషయాన్ని తేలిగ్గా తీసుకోలేరు. మీ ఆరోగ్యానికి సంబంధించిన ఒక నిజం గురించి ఇందులో చర్చించాం. ఆ అంశం మిమ్మల్ని కచ్చితంగా కదిలిస్తుంది” అని వివరించారు. పి.ఎస్. మిత్రన్ దర్శకత్వం వహిస్తున్న ‘సర్దార్ 2’ చిత్రం సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది

PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.